హెచ్ఆర్‌సి రాష్ట్ర కార్యదర్శి, సంయుక్త కార్యదర్శుల నియామకం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యక్రమాల కార్యదర్శిగా కాగజ్‌నగర్‌కు చెందిన బీరం మల్లేష్‌ను, హెచ్ఆర్‌సి సంయుక్త కార్యదర్శిగా పోతురాజుల రమేష్‌ను నియమిస్తూ హెచ్ఆర్‌సి జాతీయ ఛైర్మన్ శ్రీకాంత్ చెన్నుపాటి లేఖ జారీ చేశారు. ఈ నెల 25 నుండి 2024, సెప్టెంబర్ 12 వరకు వీరు ఈ పదవిలో కొనసాగుతారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోతురాజుల రమేష్, మల్లేష్ మాట్లాడుతూ కౌన్సిల్ మా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కౌన్సిల్‌కు అన్ని విధాల సహకరిస్తామని అన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
సోమవారం 26 జూన్ 2023

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ముదిరాజ్ కులస్తులు జిల్లా కేంద్రంలో ఆయనను కలిశారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి అండగా ఉండాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్‌కి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



దయానంద్ గైక్వాడ్ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం అంబేద్కర్ మెమోరియల్ మాజీ అధ్యక్షులు, కార్మిక సంఘం నాయకులు దయానంద్ గైక్వాడ్ సేవలు మరువలేనివని నేతకాని మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కైలాస్ నగర్ బుద్ధవిహార్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో దయానంద్ గైక్వాడ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్మికుల సంక్షేమం కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత, బీసీ సంఘం నాయకులు శాలిక్‌రావ్ నాగరాదే, బాబాసాహెబ్ కాంబ్లె, ప్రజ్ఞకుమార్, సంతోష్, ప్రశాంత్ నిమస్కర్. దళిత్ కాంబ్లె, శోభబాయి, వర్షబాయి, గంగారాం బోరెకర్, రవి జబాడే, ఉదయ్, సురేష్, సూరజ్ కాంబ్లె, రాహుల్ జందడే, మహేందర్, రగునాథ్, ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన సీఆర్టీ ఎంపిక పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన శాఖలో ఖాళీగా ఉన్న సీఆర్టీల ఎంపిక పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంటర్లను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టుల కోసం 1,198 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షకు 1,123 మంది హాజరయ్యారని, 75 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిశీలనలో ఏసీఎంఓ ఉద్దవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోడీ విజయాలను ప్రచారం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

గత తొమ్మిది సంవత్సరాల పాలనలో మోడీ సాధించిన విజయాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జీ జోర్రిగల శ్రీకాంత్, బీజేపీ సీనియర్ నాయకులు శ్యాంసుందర్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించిన "మేరా బూత్ సబ్సే మజ్ బూత్" కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ గత 9సంవత్సరాల పరిపాలన కరపత్రాలను ప్రతి బూత్ స్థాయిలో ఇంటింటికి చేరేలా ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త బాధ్యతగా భావించాలని అన్నారు. రాష్ట్ర పార్టీ ఇచ్చిన 30 రోజుల కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ నిర్వహించేలా చూడాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చేర్ల మురళీ, కొట్నక్ విజయ్, ధోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీర్ ఆత్మరాం నాయక్, కొంగ సత్యనారాయణ, కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ వెంకట్ నాయక్, చన్నపురి గణపతి, నాయకులు గోలెం వెంకటేష్, కొమరం వందన, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎలగతి సుచిత్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోవా విజయ్, జయరాజ్, సూర్య ప్రకాష్, పులి వెంకటేష్, రాథోడ్ రమేష్, సుధాకర్, వేణు, గేడం సుభాష్, జలపతి, మద్దెల శ్రీధర్, బొడ్డ శ్రీను, నిఖిల్, సంతోష్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో విద్యా బోధనకు తాత్కాలిక పద్ధతిలో అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సిఓ గోపీచంద్, జిల్లా కన్వీనర్ వెంకట ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని, హిందీ, ఇంగ్లీష్, గణితం, బయోసైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టులలో పాఠశాల, కళాశాల స్థాయిలో ఇంగ్లీష్, గణితం, బాటని, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పీజీ, బీఈడీ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8309007172 నెంబర్లు సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పాటు కానున్న ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాలలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ గోపీచంద్ రాథోడ్, జిల్లా కన్వీనర్ వెంకట ప్రసాద్ ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్‌ఈఐఎస్.తెలంగాణ.గౌ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముదిరాజ్ కులస్తులపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే జోగు రామన్న ఖండించారు. ఆదివారం ఎమ్మెల్యేను ముదిరాజ్ మహాసభ సంఘం సభ్యులు కలిసినప్పుడు ఈ వ్యాఖ్యలు చేశారు. పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు బీసీలందరికీ అవమానం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని ముదిరాజు నాయకులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇటువంటి వ్యాఖ్యలు ఎవరు చేసిన ఖండించాల్సి ఉందని తెలిపారు.

10న కుమురం భీమ్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన కుమురం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జులై 10న చేపడుతున్నట్లు కుమురం భీమ్ విగ్రహ అవిష్కరణ ఉత్సవ కమిటీ అధ్యక్షులు గోడం గణేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆదివాసులు, జిల్లా ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

ఏకగ్రీవంగా పంచశిల్పి విశ్వబ్రాహ్మణ సంఘ ఎన్నికలు

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని నాయిడివాడ విశ్వబ్రాహ్మణ సంఘ ఎన్నికలు ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్ష కార్యదర్శులు వట్టిమల్ల వెంకటరమణ, నగునూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఎన్నికల అధికారిగా కట్ట నాగాచారి పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షులుగా వడ్యపురం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా పొలాస భరత్ కుమార్, కోశాధికారిగా సింహారాజు సాగర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్నారోజుల్లో సంఘాభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

- ఆదివాసీ బిరుద్ గోండ్ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి



నవతెలంగాణ-ఉట్నూర్

తాగిన మైకంలో గిరిజన ఆదివాసీ మహిళను హత్య చేయబడ్డ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివాసీ బిరుద్‌గోండ్ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదివాసీ బిరుద్‌గోండ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ దత్తు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలంలోని ధనోర(బి)కి చెందిన కుడిమెత జంగుబాయి(35)ని నేరడిగొండలోని చించొలి గ్రామానికి చెందిన నారాయణతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు భీంరావ్ ఉన్నాడు. మృతురాలి భర్త గత ఏడాది క్రితమే మృతి చెందాడు. బాధిత మహిళ బంధువులలో ఒకరు మృతి చెందరాని గత వారం కింద తల్లిగారి ఇంటికైన దనోర(బి)కి వచ్చిందని, ఈ నెల 20న గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం తాగిన మత్తులో మృతురాలిని వెంబడించి హత్య చేశారని ఆరోపించారు. మృతురాలి కోసం కుటుంబ సభ్యులు వెతికిన కనబడలేదన్నారు. గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వైపు వెళ్లిన కొందరు మృతదేహం కనబడటంతో అందరూ అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం జంగుబాయిదేనని గుర్తించామని పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించామని, సీసీ కెమెరాలో లభించిన రికార్డుల ఆధారంగా జంగుబాయిని వెంబడించిన వారు సంతోష్, సంతోష్, ఖదీర్‌లుగా గుర్తించామని, ఆదివాసీ మహిళను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధిత కుటుంబానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న విషయం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ధర్నా విరమించేది లేదని స్పష్టం చేయడంతో డీఎస్పీ నాగేందర్ నాయకులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పీఓ వచ్చి హామీ ఇవ్వాలని కోరడంతో ఐటీడీఏ పీఓ వరుణ్ రెడ్డి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబానికి తగు న్యాయం చేస్తామని, మృతురాలి కుమారుడికి చదివించే బాధ్యత ఐటీడీఏ తీసుకువడంతో పాటుగా ఇల్లు నిర్మించి ఇస్తామని, అంత్యక్రియలకు తక్షణమే రూ.25వేలను సాయంగా అందజేశారు. పీఓ హామీ మేరకు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు లలితబాయి, భీంరావ్, జంగు ఉన్నారు.

బహుజన బాంధవుడు వీపీ సింగ్



నవతెలంగాణ-హాజీపూర్

మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేసి, బీసీలకు రిజర్వేషన్ల హక్కును ప్రదానం చేసిన మాజీ ప్రధాని విశ్వనాథ ప్రతాప్‌సింగ్ సేవలను దేశ ప్రజలు ఎల్లకాలం గుర్తుంచుకుంటారని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలలో జరిగిన విపి.సింగ్ జయంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు. 1990లో మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేసిన విపి. సింగ్ నాయకత్వంలోని జనతాదళ్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు శ్రీకారం చుట్టిన కారణంగానే బీసీల అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే పదవి నుండి దింపేస్తామని బెదిరించిన అగ్రవర్ణాలు, అద్వానీ, మురళీమనోహర్ జోషి, నరేంద్ర మోడీ నాయకత్వంలో మండల్‌కి పోటీగా కమండల్ తీసుకువచ్చారని తెలిపారు. మతోన్మాద రాజకీయాలు నెరపినా భయపడకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేసి తన పదవినే త్యాగం చేసిన బీసీ బాంధవుడు విపి.సింగ్ అని పేర్కొన్నారు. రాజ కుటుంబంలో పుట్టినా, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ప్రజా నాయకుడు విపి సింగ్ అని నివాళి అర్పించారు. విపి.సింగ్ స్ఫూర్తిని నిలబెడుతూ బీసీ బిడ్డలు ఐక్యంగా ఉద్యమిస్తూ బీసీ జనగణన, మండల్ కమిషన్ సిఫార్సుల పూర్తి అమలును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బుద్ధి చంద్రమౌళి, శ్రీపతి రాములు, షరీఫ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాపురావుకు పరామర్శలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి దగ్గర కోలుకుంటున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ నేతృత్వంలో పార్టీ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, అన్నమొళ్ల కిరణ్, బొజ్జ ఆశన్న పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తాంసి : ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌కు శనివారం మధ్యాహ్నాం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి తిరుగు ప్రయాణంలో హైవే కొరిటికల్ గ్రామ పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై పశువు రావడంతో దాన్ని తప్పించే ప్రయత్నంలో ప్రమాదం జరిగి జరిగిన విషయం తెలిసిందే. ప్రమాదంలో గాయపడ్డ ఎమ్మెల్యేను తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన నాయకులు పరామర్శించారు. ప్రమాదంలో ఎమ్మెల్యేకు చిన్న గాయం కావడంతో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు.

తలమడుగు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాశ్‌రావు, దేవిదాస్ ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి సీఎం ప్రత్యేక నిధులు కేటాయించాలి



ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రానికి ఈ నెల 30న వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 33 జిల్లాల్లో కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా అత్యంత వెనుకబడ్డ ప్రాంతమని అన్నారు. ఆర్థికంగా, ఉద్యోగ పరంగా ఇతర జిల్లాలతో పోల్చితే చాలా వెనుకబడి ఉందని, జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న వైద్య కళాశాలకు అంబేద్కర్ పేరు, కలెక్టరేట్ భవనానికి మహాత్మ జ్యోతిబాపూలే పేరును, చిల్డ్రన్ పార్కుకు జగ్జీవన్ రామ్ పార్క్ పేరు పెట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కుమురం భీం పేరుతో ఏర్పాటు చేసిన అడ ప్రాజెక్టు వద్ద 25 అడుగుల భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బహుజన ఐక్యవేదిక జిల్లా నాయకులు కవల్కార్ నాందేవ్, హివ్రే శ్రావణ్, పాడూరి రామ, ఉప్రే పత్రు, హెవీరే గంగ, కవల్కార్ వినేష్, గోవింద్ పాల్గొన్నారు.

లారీ ఓనర్లు, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లారీ ఓనర్లు, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. ఇటీవల ఆదిలాబాద్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా ఆదివారం ప్రమాణ స్వీకర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జోగు రామన్న హాజరై అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన మమ్మద్ అక్బర్, జనరల్ సెక్రటరీ పట్వాన్ సర్దార్ సింగ్‌లతో పాటు సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందచేశారు. అదేవిధంగా ఎమ్మెల్యేను సైతం నిర్వాహకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. లారీ ఓనర్లు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భరోసా కల్పించారు. రానున్న ఎన్నికల్లో గులాబి జెండా ఎగరవేయడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాజిదోద్దీన్, అష్రఫ్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా బెస్ట్ యోగా టీచర్ అవార్డు అందుకున్న కేసరి అలేఖ్య



రెబ్బెన : తమిళనాడు షేర్స్ యోగాసన ఆధ్వర్యంలో శ్రీఎస్ఎస్ శాసెన్‌జైన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సౌత్ ఇండియా బెస్ట్ యోగా టీచర్ అవార్డును రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన కేసరి అలేఖ్య ఇన్విరాల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా యోగాచార్యులు రేవెళ్లి రాజలింగు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కేసరి అంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక కిరణ్, కార్యదర్శి పీఈటీ భాస్కర్ మాట్లాడుతూ అలాక్య యోగాలో జాతీయస్థాయిలో పథకాలు సాధించి ప్రతిభ చూపుతూ రాష్ట్రానికి, జిల్లాకు వన్నె తెచ్చారన్నారు. ఎంతోమంది పిల్లలకు యోగాలో శిక్షణ ఇచ్చే రాష్ట్ర, జాతీయస్థాయిలో యోగా క్రీడాకారులుగా తీర్చిదిద్దారని అభినందించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య కత్తిపోట్ల కలకలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో కత్తిపోట్లు కలకలం రేపాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. వన్ టౌన్ ఎస్ఐ అంజమ్మ తెలిపిన వివరాల ప్రకారం..రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఇరు గ్రూపుల వారు మొదట వినాయక చౌక్‌లో ఘర్షణ పడ్డారు. అనంతరం ఖానాపూర్‌లో సైతం గొడవపడి కర్రలతో దాడి చేసుకున్నారు. ఆదిల్ అనే వ్యక్తి ఖానాపూర్‌కు చెందిన జహీర్‌ఖాన్‌పై దాడి చేయడంతో ఎడమ చేయికి బలమైన గాయమైంది. దీంతో బాధితుడు జహీర్‌ఖాన్ తన అనుచరులతో కలిసి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ కెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ప్లాట్ల విషయంలో వీరి మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది.

అన్నిదానాల కన్నా రక్తదానం గొప్పది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్నిదానాల కన్న రక్తదానం చాలా గొప్పదని, అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో ఆదివారం కిరాణా, జనరల్ స్టోర్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన రక్తదాతలను ఆయన అభినందించారు. ప్రస్తుత తరుణంలో రక్తం అవసరం ఎక్కువైపోయిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్త నిల్వలను పెంచాలని సూచించారు. ఆపద సమయంలో రక్తమిచ్చి ప్రాణదాతలు కావాలని అన్నారు. అలాగే అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్యక్రమ అతిథులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజా రెడ్డి, డీఎంహెచ్ నరేందర్ రాథోడ్, ఆర్ఎంఓ చంపత్‌రావు, వైద్యులు తిప్పస్వామి, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గణేష్, కిరాణా, జనరల్ స్టోర్ వర్కర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, చద్దర్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ విద్యా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదువుకొని ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహా ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఒక సాహసవంతమైన వీరుడని, వెనుకడుగు వేయకుండా ముందు నిలబడి యుద్ధ రంగాల్లో గెలిచిన వ్యక్తి అని అన్నారు. పూర్తిగా సెక్యూలర్ భావాలతో ఉన్న వ్యక్తి అని అన్నారు. ఈ విషయంలో బీజేపీ రాజకీయం చేస్తోందని అటువంటి వాటిని వెంటనే మానుకోవాలని హితవు పలికారు. మరో వైపు నిర్మల్ నడిబొడ్డున శివాజీచౌక్‌లో రూ.50 లక్షలతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేసింది తామేనని అన్నారు. బీజేపీ శివాజీ మహారాజుని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని, మరో వైపు తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఏఒక్క బీజేపీ నాయకుడైన పాల్గొన్నాడా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొనలేని బీజేపీ నాయకులు అమరుల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎస్పీఎం గెస్ట్‌హౌజ్‌ల పరిశీలన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 30న సీఎం కేసీఆర్ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా ప్రముఖుల బస కోసం అధికారులు ఆదివారం సిర్పూరు పేపర్ మిల్లు గెస్ట్‌హౌజ్‌లను పరిశీలించారు. అదనపు కలెక్టర్ రాజేశం స్థానిక క్రీడా మైదానం సమీపంలో ఉన్న గెస్ట్‌హౌజ్‌లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్‌లు మునావర్ షరీఫ్, రియాజ్, సిబ్బంది ఉన్నారు.

వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

నవ తెలంగాణ-మందమర్రి

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఈవెంట్స్‌లో భాగంగా ఆదివారం మందమర్రి వనిత క్లబ్ ఆధ్వర్యంలో రైతుకు సన్మాన కార్యక్రమం, నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు, చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండా చంద్రశేఖర్ గవర్నర్ గెస్ట్, కోడిప్యాక విద్యాసాగర్ రీజియన్ చైర్మన్, ఆకినపల్లి రవీందర్ జోన్ చైర్మన్, ధనలక్ష్మి రీజినల్ సెక్రటరీ, మధుశ్రీ, మందమర్రి వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తమ్మిశెట్టి మంజుల సెక్రటరీ, ట్రెజరర్ గంప రమ్య పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ముందుండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాసవి క్లబ్ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండాలని వాసవి క్లబ్ వి107ఏ గవర్నర్ కొండ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కింద నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొని పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు చేసే సేవలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సేవా కార్యక్రమాలు చేసినప్పుడే క్లబ్‌కు గుర్తింపు వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కోడిప్యాక రవీందర్, సెక్రటరీ అభిలాష్, కోశాధికారి గుండా సాయి, సభ్యులు ఆకనపల్లి రవీందర్, కోడిప్యాక విద్యాసాగర్, సిర్ప శ్రీకాంత్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు వెంకన్న, నాయకులు గుండ బాలేష్, పిన్న వివేక్, రమేష్, కొలిపాక వేణుగోపాల్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి నిధులు పెంచాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఇండ్లు లేని పేదలు నిర్మించుకునే గృహ లక్ష్మి పథకానికి నిధులు పెంచి ఆదుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానవత్ గోవింద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలు ఇండ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ.3లక్షలు సరిపోవని పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులను పెంచాలని అన్నారు. కనీసం రూ.15లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓట్ల కోసం ఇండ్ల గాలం వేయడం ఆపి పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9లక్షలు ఖర్చు చేస్తుండగా, పేదలు నిర్మించుకునే ఇండ్లకు రూ.3లక్షలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.15 లక్షలు ఇవ్వాలని కోరారు.

బీఎస్పీతోనే ఆదివాసులకు న్యాయం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



బీఎస్పీతోనే ఆదివాసులకు న్యాయం జరుగుతుందని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు అర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పలువురు ఆదివాసీ నాయకులు ఆ పార్టీలో చేరి బీఎస్పీ ఖండువాను కప్పుకున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేశారని అన్నారు. అందుకే ఆయన అడుగుజాడల్లో నడువాలనే పార్టీలో చేరినట్టు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఖానాపూర్ నియోజక వర్గంలో బీఎస్పీ జెండాను ఎగురవేయడం ఖాయమని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీఎస్పీ నాయకులు దీపక్, మురారీ, సునీల్, శివాజీ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ కులస్తులు డిమాండ్ చేశారు. ముదిరాజ్ కులస్తుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివారం ముదిరాజ్ ఆకులస్తులు ఖానాపూర్‌లో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. తొలుత పట్టణంలో ఎన్టీఆర్ చౌక్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాని అన్నారు. ఇతర కులాల వారిని అక్కున చేర్చుకునే మాదిరాజ్‌లను అవమాన పరచడం కౌశిక్ రెడ్డికి తగదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఆయనపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పంబాల బీమేశ్వర్, రవీందర్, నాగరాజు, రవి, మల్లేష్, వెంకటేష్, బుచ్చన్న, పోసులు, భీమరాజు, మురళీ, నరేష్ పాల్గొన్నారు.



సిరికొండ : తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల ముదిరాజ్ కులస్తులు మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో పాడి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడారు రాష్ట్రంలో పెద్ద సామాజిక వర్గం అయిన ముదిరాజ్‌లపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ పదవి నుండి ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఓరగంటి పెంటన్న, ఎగ్గిడి మల్లారెడ్డి, ఎగ్గిడి నడ్పి మల్లేష్, విజయ్, మల్లేష్, అమూల్, నర్సింలు, అశోక్ పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-బేల

గడప గడపకు కాంగ్రెస్ పల్లెపల్లెకు కంది శ్రీనన్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మాంగ్రూడ్, పాటన్, కొబ్బాయి, ఖోగ్దూర్ గ్రామాల్లో గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి గడప గడపకి వెళ్తు కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లాఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వామన్ వాంకడే, మండలం ఎస్టీ సెల్ చైర్మెన్ మడవి చంద్రకాంత్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ కార్మికులు సుమారు 16 వేల మంది పనిచేస్తున్నారని అన్నారు. వారికి కనీస వేతనం అమలు చేయాలని, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయ ముట్టడి చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, గజ్జు నితిన్, సాయి, రవి, అశోక్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయానికి ఆదివారం అదిలాబాద్ జిల్లా బోథ్ గ్రామానికి చెందిన సీహెచ్ రాఘవులు (రిటైర్డ్ ఎంపీడీఓ) సతీమణి సుజమ్మ కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం విరాళంగా రూ.లక్ష11వేల 116 చెక్కును ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ఆలయంలో భక్తుల కోలాహలం

నవతెలంగాణ-బాసర

బాసర సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. వేసవిలో అమ్మవారిని దర్శించుకోవాడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన, అక్షరాభ్యాస క్యూలైన్లు బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులచే ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరపున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.5లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

బీజేపీ హయాంలోనే సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హాయంలోనే దేశ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆపార్టీ మండల అధ్యక్షులు ఆరెల్లి రాజలింగం అన్నారు. ఆదివారం ఆ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని ఏమాయికుంట, బర్సాన్ పటార్ తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాల పై ప్రజలకు వివరించారు. కరోనా బాధితులకు ముద్ర రుణాలు, మహిళల సాధికారత, స్వచ్ఛ భారత్ అభియాన్ మరుగు దొడ్లు, పేదలకు ఉపాధి హామీ చట్టం, చిన్న సన్న కారు రైతులకు రూ. 6 వేల పెట్టుబడి ఆర్థిక సాయం వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు దిలీప్ మోరే, పద్వాల్ విజయ్‌సింగ్, కే. ప్రహ్లద్, సుధీర్ చరక్ పాల్గొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 30న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను పార్టీ కార్యకర్తలు ప్రజలు విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండలంలోని భీంపూర్ గ్రామంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు యూనుస్ అక్బానీ, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావ్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ విష్ణు రాథోడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జంతు రోగాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మండలంలో పశువులకు సోకుతున్న లంపి స్కిన్ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యురాలు డాక్టర్ దీప్తి అన్నారు. ఆదివారం స్థానికంగా ఒక పశువు శరీరంపై వచ్చిన మచ్చలను ఉద్యేశించి ఆమె మాట్లాడారు. ఈ వ్యాధి గత రెండు సంవత్సరాల కాలంగా పశువులకు సోకుతుందని కరోనా అనంతరం వస్తున్న ఈ వ్యాధి నివారణకు ప్రత్యేకమైన ఔషధాలు ఏమి లేవని అన్నారు. వ్యాధి సోకిన వెంటనే రైతులు స్పందించి సమీపంలోని పశువైద్యశాలకు తీసుకు వచ్చినట్లయితే రోగ నివారణకు చర్యలు తీసుకోవచ్చు అన్నారు. మొదట్లో గుర్తించినట్లయితే ఐదు రోజుల్లోగా ఈ వ్యాధిని నివారించవచ్చని, ఆలస్యమైనప్పుడే వ్యాధి నివారణకు మార్గాలు లేవని ఆమె స్పష్టం చేశారు. పశువులకు ఎలాంటి రోగాలు సోకినా వెంటనే స్పందించి పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించాలని ఆమె రైతులను కోరారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

● పోలీస్ స్టేషన్‌లో రైతుల ఫిర్యాదు

రైతుల వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్లను దొంగలు చోరీ చేశారు. ఈమేరకు సదరు రైతులు శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిలావర్‌పూర్ శివారులోని గోదావరి తీరంలో తమ పంట పొలాలకు ఖానాపూర్, గోడల పంపు గ్రామాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. స్టార్టర్లను నుంచి మోటారు వరకు భూమిలోపల వేసుకున్న సర్వీసు వైరును బయటకు తీసి బండరాయితో తెంపి వైర్లను ఎత్తుకెళ్లారు. గోడల పంపు గ్రామానికి చెందిన రైతు చిన్న రాజమల్లుకు సంబంధించిన సుమారు 70 మీటర్ల పొడవైన రూ.5వేల 600 విలువ చేసే వైరును ఎత్తుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమంద సుదర్శన్‌కు చెందిన రూ.4వేల విలువచేసే సర్వీసువైరు, పాదం రాజేశ్వర్ రూ.5వేల 600 విలువైన వైరు, ఖానాపూర్ చెందిన రైతు గుమ్ముల రాజేందర్‌కు సంబంధించిన రూ.10వేల విలువైన రెండు వ్యవసాయ మోటార్ల వైరు, గుమ్ముల లక్ష్మణ్ రూ.11వేలు విలువచేసే 140 మీటర్ల సర్వీసు వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. ఖరీఫ్ సమీపించిన సమయంలో వ్యవసాయ మోటార్ల వైర్లను ఎత్తుకెళ్లడం ఆర్థికంగా నష్టం కలిగించడంతో పాటు పనులకు ఆటంకం కలిగించారని సదరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అనారోగ్యంతో దండోరా ఉద్యమ నాయకుడి మృతి



నవతెలంగాణ-జైనథ్

అనారోగ్యంతో దండోరా ఉద్యమ నాయకుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇరిగెల గంగన్న(65) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. అతడి చివరి అంతిమయాత్రకి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ హాజరై తమ దిగ్భ్రాంతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లను సమాన పంపిణీ జరగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 29 సంవత్సరాలుగా జరుగుతున్న పోరాటంలో జాతి కోసం మిలిటెంట్ పోరాటాలు సైతం చేస్తూ తన సమయాన్ని శ్రమను ధారపోశారని అన్నారు. జాతిని చైతన్య పరుస్తూ తుదిశ్వాస వరకు జాతి ఉద్యమంలో జిల్లాలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఎలాంటి చదువు లేకపోయినా ఆకట్టుకునే తన ప్రసంగాలతో నేటి యువతరాన్ని కూడా ఆలోచింపజేశావాడని అన్నారు. ఈ అంతిమ యాత్రలో గ్రామ సర్పంచ్ దుమాల దేవన్న, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బిక్కి పోచ్చన్న, దుమ్మ శ్రీహరి, దుమాల స్వామి, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ అల్లకొండ రవి, గ్రామ అధ్యక్షులు కోడిచెర్ల శివ, శివన్న, అశన్న, ఏంపెల్లి గోవర్ధన్, కుంటాల రమేష్, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం



నవతెలంగాణ-బోథ్

యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివ రాథోడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 2న జరగబోయే రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని, క్విజ్ కాంపిటేషన్‌ను విజయవంతం చేయాలని కోరారు. అలాగే రాబోయే తరాలకు యువత మార్గదర్శమని కొనియాడారు. అదేవిధంగా యూత్ కాంగ్రెస్ బలోపేతానికి ఎప్పుడు ముందుంటామని అన్నారు. మండలంలో కమిటీలు ఏర్పాటు చేసి యూత్ ప్రెసిడెంట్లను త్వరలో నియమిస్తామని అన్నారు. ఎవరైతే చురుకుగా పని చేస్తారో వారికి తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు సల్ల రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా యూత్ ప్రెసిడెంట్ చరణ్ గౌడ్, సభ్యులు వినయ్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సాయిరెడ్డి, వినోద్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలో కొస్తే రూ.2లక్షల రుణమాఫీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్, డాల్డా కంపెనీ, నానా పటేల్‌నగర్ కాలనీలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పలంటే కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు, ఉద్యోగ అవకాశాలు, రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబకంటి అశోక్, నగేశ్, ప్రభాకర్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి, మధుకర్, సాదిక్ పాల్గొన్నారు.

మాలీ కులస్తులకు వెంటనే ఎస్టీ హోదా కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద వైఖరితో మాలీ కులస్తుల ఎస్టీ హోదా త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతూ ఉందని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సంఘ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుక బడి ఉన్న మాలీకులస్తులకు ఎస్టీ హోదా జీఓ వెంటనే తీసి దాని ద్వారా అభివృద్ధికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండె, రాష్ట్ర కోశాధికారి సతీష్ గురునులే, జిల్లా ప్రధాన కార్యదర్శి వాడగురే ఉత్తం, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ధనుంజయ్ ప్రధాన్, పట్టణ అధ్యక్షులు శీను ఆచారి, ఉద్యోగ సంఘ కార్యదర్శి కోరంగే అనిల్ పాల్గొన్నారు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొని ఇద్దరు యువకుల మృతి

నవతెలంగాణ-తలమడుగు

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘన మండలంలోని నడింపల్లె గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి నడింపల్లె గ్రామానికి చెందని మడవి శంకర్(22), మడవి చినబాపు(24), లక్ష్మీపూర్‌లోని తమ బంధువుల ఇంటి వెళుతుండగా, సుంకిడి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న ఘటనలో మడవి చినబాపు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన మడవి శంకర్‌ను 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు శంకర్ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అప్పారావు తెలిపారు.

27న ఆర్టీసీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిపో కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని దర్మారం గ్రామంలో ఆదివారం పోచమ్మ ఆలయ పరిసరాల్లో భక్తులకు సౌకర్యార్థం జెడ్పీ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 2లక్షలు, మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.లక్ష 50వేలను మంజూరు కావడంతో ఆదివారం ఆ పనులకు డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మెన్ రాంకిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, అడ్వాల రమేష్, గంగారాం, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు సుమన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన హలో విద్యార్థి చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ప్రయివేట్ విద్యా సంస్థల్లోని ఫీజుల దోపిడిని అరికట్టాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్‌ను మెరుగుపరచి, తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

మహిళ హత్య కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ధనోర(బి) గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చిన బావిలో మహిళ మృతదేహం కేసులో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీ పూటేజి ఆధారంగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతురాలితో కలిసి వెళ్తున్న దృశ్యాలను గుర్తించినట్లు సమాచారం. అదే గ్రామంలో బెల్టు షాపులో రాత్రి వేళలో నిందితులు అతిగా మద్యం తాగి సదరు మహిళను గ్రామ పొలిమేరలో తీసుకెళ్లి లైంగిక దాడి చేసి, అనంతరం హత్య చేసి బావిలో పడేసి ఉంటారని గ్రామంలో ప్రచారం జరుగుతోంది. దీనిపై పూర్తి విచారణ అనంతరం పోలీసులు వివరాలు వెల్లడించనున్నట్టు తెలిసింది.

తాత్కాలిక పద్ధతిన నియామకాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపులే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో ఆయా సబ్జెక్టుల్లో బోధనకు తాత్కాలిక పద్ధతిన నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో గోపీచంద్, కన్వీనర్ కె.విద్య ఒక ప్రకటలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, మ్యాథ్స్, ఫిజికల్ సైన్సు, సోషల్ సబ్జెక్టులకు పాఠశాలల్లో, తెలుగు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బాటనీ, ఎకానమిక్స్, సివిక్స్, హిస్టరీ సబ్జెక్టులకు కళాశాలల్లో బోధకుల అవసరముందని వివరించారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు బీఎడ్ తప్పనిసరి చేసి ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 27లోగా ఆదిలాబాద్ పట్టణం న్యూహౌజింగ్ బోర్డు కాలనీలోని ఎంజేపీ స్కూల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, దీనికి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని పట్టణ కన్వీనర్ అక్షయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలు మొదలై నెల గడుస్తున్నా కూడా ఇప్పటివరకు పుస్తకాల పంపిణీ చేయలేదని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అదేవిధంగా ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాల పేరుతో తల్లిదండ్రుల రక్తాన్ని పిండుతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 26న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించి, విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు అరుణ్, శ్రీ వర్ధన్, అఖిలేష్, నిలేష్, అశోక్ ఉన్నారు.

నేటి నుంచి పఠణోత్సవ కార్యక్రమం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో పఠణాసక్తిని పెంచడానికి సోమవారం నుంచి జులై 31 వరకు పఠణోత్సవ కార్యక్రమం చేపడుతున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పఠణోత్సవ (రీడింగ్ కాంపెయిన్) కార్యక్రమాన్ని ప్రారంభించాలని తద్వారా విద్యార్థుల్లో పఠనాశక్తి పెంచి తద్వారా విద్యార్థులను గుణాత్మక విద్య వైపు నడిపించాలని, కార్యక్రమాన్ని ఉదయం 10 నుండి 10:30 గంటల మధ్య ఒక పండుగ వాతావరణంలో ప్రారంభించాలని పేర్కొన్నారు. ప్రతి తరగతికి పుస్తక పఠనం కోసం రోజు పీరియడ్ కేటాయించాలని వారంలో మూడు రోజులు మాతృభాష, మూడు రోజులు ఆంగ్ల భాషకు సంబంధించిన కథల పుస్తకాలు, పాఠ్యాంశాల పుస్తకాలు, గ్రంథాలయ పుస్తకాలు చదివించాలని, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వెంటనే అరెస్ట్ చేయాలని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డుపై బైఠాయించారు. మండలంలోని డబ్బా గ్రామంలో కుమురంభీం చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. హుజూరాబాద్‌లో ముదిరాజ్ కులానికి చెందిన జర్నలిస్ట్‌పై బూతు మాటలు తిడుతూ చిత్రహింసలు పెట్టిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-రెబ్బెన

బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారాం నాయక్ అన్నారు. మండలంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌ఛార్జి జెర్రిగల శ్రీకాంత్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, కరోనా కష్టకాలంలో ప్రపంచానికే టీకాను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. బీజేపీ పాలనలో జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు రోడ్డు వ్యవస్థలో ఎంతో మెరుగు పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పనితీరును ప్రజలకు తెలియజేస్తే ప్రజలను చైతన్యవంతులను చేయడమే ఇంటింటికి బీజేపీ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నీళ్లు, నిధులు, నియామకాలు కేవలం కల్వకుంట్ల కుటుంబానికే దక్కాయని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్, మురళీ, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, సీనియర్ నాయకులు సుదర్శన్‌గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విజయ్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, రెబ్బెన మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

- అర్చకుల సంఘం నూతన అధ్యక్షుడు శిరీష్ శర్మ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ధూప దీప నైవేద్య పథకం పరిధిలోకి వస్తున్న అర్చకుల సమస్యల పరిష్కారం కోసం అర్చకులు అంత ఐక్యంగా ముందుకు సాగాలని సంఘం నూతన అధ్యక్షుడు శిరీష్ శర్మ అన్నారు. మండలంలోని కేస్లాపూర్ ఆలయంలో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శిరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ అర్చకులు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. సభ్యుల సహకారం ఉన్నప్పుడే ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. సంఘటితంగా ఉంటే పోరాటం సులభం అవుతుందని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రూప్నర్ రమేష్, పిన్న వివేక్, వెంకటేశ్వర్లు, ఉదయ్ పాల్గొన్నారు.



అర్చకుల నూతన కమిటీ సభ్యుడలే వీరే

అధ్యక్షుడిగా శిరీష్ శర్మ, ఎంపిక కాగా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ శర్మ, ఉపాధ్యక్షులుగా మహేశ్వర చారి, బాపుదేవ్, గౌరవ అధ్యక్షులుగా శంకర్, కోశాధికారిగా నిమ్మకంటి సంతోష్ శర్మ, సహాయ కార్యదర్శిగా జంబోజు తిరుపతి, అభయ్ ఆచార్య, అధికార ప్రతినిధులుగా గంగు సత్యనారాయణ, సుబ్బ మహేశ్వర్, సభ్యులుగా వెంకటసాయి, వెంకటేశ్వర్, సుభాష్, ఉపేందర్, నాగభూషణ్, ప్రశాంత్ ఎన్నికయ్యారు.

ఘనంగా వీపీ సింగ్ జయంతి

నవతెలంగాణ-జన్నారం

బీసీ నాయకుడు వీపీ సింగ్ 92వ జయంతి వేడుకలను జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బీసీ సంఘం మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోదూరు చంద్రయ్య మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ, పార్లమెంటులలో తీర్మానాలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇస్తున్న రూ.లక్ష సాయాన్ని బీసీ కులాల్లో ఉన్న వర్గాల వారందరికీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం, కరీంనగర్ జోన్ కన్వీనర్ కె.ఏ నరసింహులు, శ్రీరాముల గంగాధర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోకన్వీనర్ కోడి జుట్టు రాజయ్య, జిల్లా కోకన్వీనర్ వెంకటేష్, మండల నాయకులు సంతోష్, లక్ష్మణ్ వర్మ, ఆడెపు లక్ష్మీనారాయణ, కన్వీనర్ కడార్ల నరసయ్య, మూల భాస్కర్‌గౌడ్, పిల్లి మల్లయ్య, అయినవేణి రవి, ఆకుల నరసయ్య, మామిడి విజయ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూరు మండలంలోని అక్కేపల్లి, కిష్టంపేట, ఎలక్కపేట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు పరిశీలించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో పోలింక్ కేంద్రాల సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఓటు హక్కును వినియోగించుకోవాలని రాబోయే భవిష్యత్తు ఓటు హక్కు పైనే ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరూ తమ ఓటును సక్రమమైన రీతిలో ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతి వ్యక్తికి ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని సరైన రీతిలో ఉపయోగించుకోవాలని అన్నారు.

మున్నూరుకాపు యూత్ కన్వీనర్‌గా గడ్డల సురేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

మున్నూరు కాపు యూత్ కన్వీనర్ గడ్డల సురేష్ పటేల్, మున్నూరు కాపు మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా కుందారపు శంకరమ్మలను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్నలు ఉత్తర్వులు విడుదల చేసి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా నియమితులైన వారు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తామని అన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్



నవతెలంగాణ-హాజీపూర్

విద్యారంగాన్ని కాపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యద్శి ఏ.వెంకట్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పాఠశాలలకు రంగులు వేయడమే కాదు, అందులో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్ట్ లను భర్తీ చేయాలన్నారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను, ఒక పాఠశాలనుండి ఇంకొక పాఠశాలకు పంపకుండా, ప్రమోషన్ల ద్వారా, నూతన రిక్రూట్మెంట్ ద్వారా ఖాళీ పోస్టలను భర్తీ చేయాలన్నారు. రిక్రూట్మెంట్ చేసే వరకు విద్యావాలంటీర్ లను నియమించాలన్నారు. కేసు క్లియర్ చేయించి బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్సులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ కేజీబీవీ యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్దరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు లావణ్య, జిల్లా కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, దేవదాస్, సంతోష్, కిరణ్ 18 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

'దేశ సమగ్రత కోసం గోవులను వధించొద్దు'



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలోని చట్టాలను గౌరవిస్తూ దేశ సమైక్యత, సమగ్రత కోసం గోవులను వధించవద్దని వక్తలు ముస్లిం సమాజానికి సూచించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో హాజరైన సింగల్ విండో ఛైర్మన్ అలీ బిన్ అహ్మద్, జామ మసీద్ అధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, ఉస్మానియా మస్జిద్ అధ్యక్షులు అహ్మద్ బిన్ అబ్దుల్లా, ఈద్గా కమిటీ అధ్యక్షులు అమన్ ఉల్లా పర్వేజ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రహమాన్, ముస్లిం నాయకులు అబ్దుల్లా పలువురు నాయకులు మాట్లాడారు. గోవులను వధించకూడదనే ప్రభుత్వ నిషేధాలు అమలులో ఉన్నప్పటికీ వాటిని గౌరవించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా బలి ఇచ్చే జంతువుల్లో ఆవులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర సోదరుల మనోభావాలను గౌరవించాలని ఇస్లాం నేర్పిస్తుందని తెలిపారు. కొంతమంది గోరక్ష పేరుతో దాడులకు పాల్పడుతున్నారని ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేల 29 తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాలో ఉదయం 8:30 గంటలకు ప్రార్ధనలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కర్యక్రమంలో ముస్లిం నాయకులు సయ్యద్ నిసార్, సాజిద్, షబ్బీర్, తన్ను అమర్ బీన్ అహ్మద్, తరిక్, ఎండి అహ్మద్, తాజ్, సలీం, సల్మాన్‌ఖాన్, కషిఫ్ హష్మీ షాహిద్, అబ్దుల్లా, ఇస్లాం, ఆఫ్సర్, జకీర్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 'ఉదయాస్తమాన సేవా' కార్యక్రమాలు



నవతెలంగాణ-హాజీపూర్

సేవా కార్యక్రమాలకు ప్రతిరూపంగా నిలుస్తున్న మంచిర్యాల వాసవీ క్లబ్ రీజియన్-1 స్థాయిలో డాన్ టు డస్క్ (ఉదయాస్తమాన సేవా) కార్యక్రమాలను ఆదివారం మంచిర్యాల పట్టణంలో నిర్వహించారు. జిల్లాలోని రీజియన్-1 పరిధిలో మంచిర్యాల వాసవీ క్లబ్, వాసవి యూత్ క్లబ్ మంచిర్యాల, ఇ వనితా విజయం క్లబ్ వేంపల్లి క్లబ్‌లు పలు రకాల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ డాన్ టూ డస్క్ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ వాసవీ క్లబ్ జాయింట్ సెక్రటరీ అలిమిల్ల మనోజ్, అంతర్జాతీయ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఇల్లందుల కిశోర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల వాసవీ క్లబ్‌లు అనేక సేవా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నాయని ప్రశంసించారు. ఎక్కడ సేవా కార్యక్రమాలు అవసరమో అక్కడికి వెళ్లి వాసవీ క్లబ్ ముందుండి సేవలు అందించడం లక్ష్యంగా పని చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొదట స్థానిక విశ్వనాథ ఆలయంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రీజియన్-1 పరిధిలోని వాసవి క్లబ్, వాసవి యూత్ క్లబ్, ఇ వనితా విజయం క్లబ్ వేంపల్లి క్లబ్‌లు నిరుపేద వైశ్య కుటుంబాలకు ఒక నెలకు సరిపడ నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. అలాగే డాన్ టు డస్ట్ భాగంగా దేశానికి వెన్నెముఖగా నిలుస్తున్న పంటలను పండించే రైతుకు వ్యవసాయానికి అవసరమైన స్ప్రే యంత్రాలను పంపిణీ చేశారు. దేశ సరిహద్దులో కాపాల కాస్తు రక్షణ విభాగంగా కీలక పాత్ర పోషిస్తున్న జవాన్లను ఘనంగా సత్కరించారు. అనంతరం తోళ్ళవాగు వద్ద, వేంపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్వాగత సూచిక బోర్డులను ప్రారంభించారు. అలాగే స్థానిక రెడ్ క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలోని మహిళా వృద్దులకు చీరలను, వృద్ధ పురుషులకు ధోతులను పంపిణీ చేశారు. అనంతరం అతిథులు రీజియన్-1 పరిధిలోని వాసవీ క్లబ్స్ ఈ సంవత్సరం ఇప్పటి వరకు నిర్వహించిన సేవా కార్యక్రమాలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలలో అంతర్జాతీయ వాసవీ క్లబ్ సీనియర్ ఉపాధ్యక్షులు ముక్తా శ్రీనివాస్, కటుకం హరీష్, వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ కొంకుముట్టి వెంకటేశ్వర్లు, రీజియన్ సెక్రటరి కాచం సతీష్, జోన్ చైర్మన్ కేశెట్టి వంశీకృష్ణ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు నలుమాసు ప్రవీణ్, కార్యదర్శి ఎర్రం వెంకటేష్, కోశాధికారి చిలువేరు మహేష్, దాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు తాటిపల్లి సాయివర్ధన్, ఇ వనిత విజయం వేంపల్లి క్లబ్ అధ్యక్షురాలు దొంతులు లావణ్య, కార్యదర్శి సాదు స్వప్న, కోశాధికారి బాల శ్రీమ, క్యాబినెట్ సెక్రటరి అప్పాల శ్రీధర్, అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు పుల్లూరి బాలమోహన్, దొంతుల ముఖేష్, రాచర్ల చంద్రశేఖర్, వీకేఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి పుత్తూరి రమేష్, జిల్లా అధికారులు నాగిశెట్టి జ్యోతి, నలుమాసు లావణ్య, రీజియన్ సెక్రటరి సిద్ధంశెట్టి మధుశ్రీ, జోన్ చైర్మన్ గౌరిశెట్టి ధనలక్ష్మి, నాయకులు కొంకుముట్టి మహేశ్వర్, నాగిశెట్టి శ్రీనివాస్, చిటుమల్ల శ్రీనివాస్, పాత సాయిసూరజ్ మల్యాల యోగేశ్వర్ పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థిని ప్రతిభ చాటడం అభినందనీయం



నవతెలంగాణ-జైనూర్

ఆదివాసీ గిరిజన విద్యార్థిని నేషనల్ ఇన్స్టూట్ ఆఫ్ టెక్నాలజీలో సీటు సాధించడం అభినందనీయమని ఆదివాసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాసీ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన గిరిజన యువతి కుమ్ర పద్మను ఆదివాసీ సేనా సంఘం నాయకులు శాలువాలు కప్పి, ఆర్థిక సాయం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల మండలమైన జైనూర్ మండలంలోని రాసిమెట్ట గ్రామంలోని పొద్దుగూడ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన ఓ గిరిజన యువతి నేషనల్ ఇన్స్టూట్ ఆఫ్ టెక్నాలజీలో సీటు దక్కించుకోవడం గిరిజన ఆదివాసులకు గర్వకారణమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వనరులను అందిపుచ్చుకొని తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించడం గర్వకారణమన్నారు. దాదాపు 10 సంవత్సరాల నుండి తల్లిదండ్రులు మతిస్తిమితం కోల్పోయి ఎక్కడున్నాడో కూడా తెలియని పరిస్థితిలో కుటుంబాన్ని పోషించడానికి తల్లి పడుతున్న కష్టాలను అర్థం చేసుకొని ఉన్నత విద్యలో రాణించటం అభినందనీయమన్నారు. నేటి తరం యువతకు పద్మ స్ఫూర్తి దాతగా నిలిచారని, ఆదివాసీ సమాజంలోని యువత ఉన్నత చదువులు చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కూడా ధృడ సంకల్పంతో నీట్‌లో సీటు పొందడం తన ఉజ్వల భవిష్యత్తుకు దారితీస్తుందని కొనియాడారు. ఉన్నత చదువులు పూర్తిచేసుకొని, ప్రభుత్వ ఉద్యోగం సాధించి జీవితంలో సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువుల కోసం ఐటీడీఏ ద్వారా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం మంజూరైనప్పటికీ ఇప్పటివరకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఎక్కడ కూడా నెలకొల్పకపోవడం సోచనీయమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పి ఆదివాసీ విద్యార్థుల విద్య కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రాయిసిడం జంగు పటేల్, రాష్ట్ర నాయకులు తొడసం భీమా పటేల్, జిల్లా అధ్యక్షుడు కొట్నాక గణపతి, రాయిసెంటర్ తార్మెడి కుమ్ర దుందేరావు, గ్రామపటేల్ రాము, గుణవంత్‌రావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

గొర్రెల మేకల పెంపకదారుల కార్పొరేషన్ మంచిర్యాల జిల్లా డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గట్టు మహేష్‌ను ఆదివారం ఆయనతో పదవ తరగతి చదివిన మిత్రులు శాలువా పూలమాలలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపక దారుల అభివృద్ధి కోసం మహేష్ తన శాయశక్తుల కృషి చేయాలని వారు కోరారు. గొర్రెల మేకల పెంపకదారులకు అండగా నిలవాలన్నారు. వారిని అన్ని విధాల ఆదుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యకమంలో వారి మిత్రులు కానిగంటి లక్ష్మణ్ వర్మ, ఎంబడి మహేష్, నరేష్, ఈర్ల రవీందర్, ఓ రమేష్, ముగాల వెంకటేష్, కాస్తులపూరి నరేష్, గుండా మారుతి పాల్గొన్నారు



వనభోజనానికి రూ.300 వసూలు

- గాందారి మైసమ్మ జాతరలో భక్తుల వద్ద దోపిడీ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ జాతరలో వనభోజనాలకు వచ్చే భక్తుల వద్ద రూ.300 వసూలు చేస్తున్నారు. కొంతమంది సిబ్బందిని నియమించి వసూళ్లకు పాల్పడుతున్నారు. దేవాలయంలో మొక్కులు చెల్లించుకొని స్థానికంగా వన భోజనాలు చేసే పార్కులో భక్తుల వద్ద నుంచి రూ.300 టికెట్ ధర నిర్ణయించి బహిరంగంగా వసూలు చేస్తున్నారు. వసూలు చేసిన డబ్బులను సరైన మార్గంలో వినియోగించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ సరైన ఏర్పాట్లు లేక దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శిస్తున్నారు. ఎటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకుండానే డబ్బులు వసూలు చేయటమేంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. టికెట్ ధర కూడా భారీగా పెట్టి దురుసుగా మాట్లాడుతూ కట్టక పోతే బయటికి వెళ్ళండి అని బెదిరింపులకు పాల్పడటం సరికాదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు మొక్కులు తీర్చుకొనేందుకు దేవాలయానికి కుటుంబ సమేతంగా వస్తుంటారని, దీనిని అధికారులు పునర్ పరిశీలించి జాతరలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాత వసూలు చేస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.

అంబరాన్నంటిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో అంబరాన్ని అంటేలా సాగాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల కార్యక్రమాలతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసేలా కార్యక్రమాలు ఆద్యంతం ఉత్తేజం నింపాయి. ఈ సందర్భంగా గురువులు రమేష్, దత్తుమూర్తి, కొమరయ్య పద్మాకర్ రావు, ప్రతిభలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా తమ విద్యార్థులను మరోసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడమే గురువులకు గొప్ప గౌరవమని తెలిపారు. తమ ద్వారా విద్య నేర్చుకుని ఉన్నత స్థానాలు సంపాదించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కిందటి తన స్నేహితులను మరొకసారి కలుసుకునే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. తమ తరగతికి చెందినవారు కొంతమంది మరణించగా వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల మేకల శ్రీనివాస్, గుండా వెంకన్న, మోహన్, ఖాజా మసియొద్దీన్, యు.రమేష్ అచ్యుత్, దీపక్, బండి శ్రీనివాస్, రవీందర్, కిషన్, సంతోష్, సువర్ణ, మాధవి, గీత, ఉషశ్రీ, భారతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకుల చేరిక



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి పట్టణం చైతన్య నగర్ ఫిల్టర్ బెడ్ ప్రాంతంలోని దాదాపు 200 మంది యువత ఆదివారం పీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, పీసీసీ సభ్యుడు నూకల రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో బాల్క సుమన్ చేసింది ఏమీ లేదని కేవలం కార్యకర్తలను మభ్యపెడుతూ వారిని మోసం చేస్తున్నాడని కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు బడుగులకు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులమై చేరామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందే రామచందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, క్యాతన్ పల్లి పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండి జమీల్, ఎండి సుకూర్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరవేట్ల శ్రీనివాస్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గడ్డం రజిని, మండల అధ్యక్షుడు నీలయ్య, ఎస్సీ సెల్ నాయకులు మరాఠీ శంకర్, బానయ్య జనార్ధన్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనీష్ అన్నారు. ఆదివారం జన్నారంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు పుస్తకాలు డ్రెస్సులను వెంటనే అందించాలని అన్నారు. బందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏబీవీపీ మండల నాయకులు పాల్గొన్నారు.